ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పురుషోత్తమకుమార్

రేపు జాతీయ లోక్ అదాలత్

- ఉమ్మడి పశ్చిమలో 4,543 కేసుల పరిష్కారానికి చర్యలు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 12 : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో ఈనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ చెప్పారు. జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 4,543 కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 33 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దూర ప్రాంతాల్లో ఉండే కక్షిదారులు తమ కేసులు రాజీ చేసుకోదలచిన వారు ఆన్‌లైన్ ద్వారా హాజరై తమ కేసును పరిష్కరించుకోవచ్చన్నారు. దీనికి సంబంధించి ప్రతి కోర్టులలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారన్నారు. సమావేశంలో పర్మినెంట్‌లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ సభ్యులు బీవీ కృష్ణారెడ్డి, ఏలూరు బార్ అధ్యక్షులు, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్ పాల్గొన్నారు. ఈనెల 14వ తేదీన జరిగే జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మరో ప్రకటనలో జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు.

బదిలీలలు!

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 14 ప్రభుత్వ శాఖల్లో ఒకేచోట ఐదేళ్లకు పైగా పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని నిర్ణయించి ఆ మేరకు ప్రక్రియ ఆరంభించిన నాటి దగ్గర నుంచి ఇప్పటివరకు అనేక లీలలు చోటు చేసుకున్నాయి. ప్రత్యేకించి సచివాలయ సిబ్బందిని సాధ్యమైనంత మేర మార్చే క్రమంలో ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఎందుకంటే గత ఐదేళ్లపాటు సచివాలయ సిబ్బందిలో అత్యధికులు వైసీపీకి సానుకూలంగా పనిచేశారన్న అపవాదు లేకపోలేదు. ఈ క్రమంలో జిల్లాలో 800 మందికి పైగా విధిగా బదిలీ కాబోతున్నారు. సచివాలయ సిబ్బంది రిక్వెస్ట్ బదిలీల్లోను ప్రత్యేకించి స్థానిక ఎమ్మెల్యే, వారి అనుచర బృందాలన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే నియోజకవర్గం దాటి బదిలీ కాకుండా కొందరు వ్యక్తిగతంగా, రాజకీయపరంగా ప్రయత్నాలు ఆరంభించారు. దాదాపు ఈనెల మొదటి వారం వరకు ఈ ప్రయత్నాలన్నీ వేగంగా సాగాయి. కాని ఎప్పుడైతే వరదలు ఆరంభమయ్యాయో ఈ ప్రక్రియ వెనుకబడింది. ఉద్యోగుల బదిలీల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి కేవలం ఇంజనీర్లను మాత్రమే బదిలీ చేస్తున్నారు. ఆయా శాఖల్లో ఉన్న మినిస్టీరియల్ సిబ్బందికి ఈ బదిలీలు వర్తించవు. ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ వంటి శాఖల్లో ఈ తరహా బదిలీలకు ఆస్కారం ఉండగా కొందరు ఇంజనీర్లు తాము కోరుకున్న ప్రాంతానికి బదిలీ అయ్యేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇంజనీరింగ్ విభాగాల్లో కొందరు జిల్లా కేంద్రంలో కంటే రూరల్ ప్రాంతంలోనే మసలేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగాల్లో దాదాపు 60 నుంచి 100 లోపు బదిలీలు ఉంటాయని అంచనా. ఉమ్మడి పశ్చిమ గోదా వరిని మాత్రమే పరిగణనలోకి తీసుకుని ఈ బదిలీ ప్రక్రియ నిర్వహించే బాధ్యతను కలెక్టర్ వెట్రిసెల్వికి అప్పగించారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 22 వరకు ప్రక్రియ పొడిగింపు

- ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ఉద్యోగులు..
- ఇంకొందరు అడ్డదారుల్లో..
- ఎక్సైజ్‌లో ఒకరికి మించి మరొకరు పోటీలు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై నిషేధం తొలగించి ఈనెల 16కల్లా ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సిందిగా ఇంతకుముందు ఆదేశించింది. ఈలోపే వరదలు రావడంతో సహాయ చర్యల్లో అందరూ నిమగ్నమై ఉన్నారు. ఈ తరుణంలో మరోసారి బదిలీల ప్రక్రియను పొడిగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరికొద్ది రోజుల్లోనే పోస్టింగ్ ఆర్డర్లకు అవకాశం ఉన్న తరుణంలోనే ఇప్పుడున్న ప్రక్రియను ఈనెల 22 వరకు ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఆపై 23వ తేదీ నుంచి బదిలీల ప్రక్రియ నిలిచిపోనుంది. ఇప్పటికే తమకు కావాల్సిన ప్రాంతంలో పోస్టింగ్ కోసం మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ గిర గిరా తిరిగారు. మరో సారి గడువు పొడిగింపుతో తమ ప్రయత్నాలకు మరింత పదును పెట్టబోతున్నారు.

మాకంటే.. మాకే..

బదిలీ ప్రక్రియల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఉండడంతో ఆ శాఖకు సంబంధించిన కొందరు ఉన్నత స్థాయిలోనే కోరుకున్న స్థానం కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఏలూరు, భీమవరం, తణుకు, నూజివీడు తదితరచోట్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య ఇంతకు ముందు కంటే ఈ మధ్యన పెరిగింది. వైసీపీ ప్రభుత్వం ఓటమిపాలై ఆ స్థానంలో కూటమి ప్రభుత్వం రావడంతో లావాదేవీలు పెరిగి దాని ప్రభావం కాస్తా రిజిస్ట్రేషన్లపై పడింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖలోనే బదిలీలు కోరుకున్న వారి సంఖ్య భారీగా పెరిగింది.



సిఫార్సులపై పునరాలోచన..

బదిలీల ప్రక్రియ ముందుకు పొడిగించడంతో ఇప్పటికే కొందరి విషయంలో ఇచ్చిన సిఫార్సులపైన ఎమ్మెల్యేలు పునరాలోచనలో పడినట్టు చెబుతున్నారు. ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కొందరిని తమ నియోజకవర్గంలోకి బదిలీ చేయించుకునే దిశగా కొందరు ఎమ్మెల్యేలు ఇంతకు ముందు ఇచ్చిన సిఫార్సు లేఖలను మార్చే ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. సామాజిక వర్గాల వారిగా, గడిచిన ఐదేళ్లల్లోను ప్రభుత్వపరంగా ఏ పనులు లేక ఒకేచోట ఉండిపోయి విసుగెత్తిన ఇంకొందరు తమకు ఫలానా ప్రాంతం కావాలని పట్టుబట్టి మరీ అమరావతి నుంచి ఫోన్‌లు చేయించడం, తదనుగుణంగానే మార్పులు, చేర్పులకు వీలుగానే సిఫార్సు లేఖలు మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. సచివాలయ సిబ్బంది విషయంలోను ఇప్పుడు ఇదే జరుగుతోంది. ఇంతకుముందు ఓ వెలుగు వెలిగి గత ప్రభుత్వం సెబ్ ఏర్పాటు చేసిన తర్వాత ఎక్సైజ్‌లో చాలా మంది డీలా పడ్డారు. ఇప్పుడు తాజాగా సెబ్‌ను రద్దు చేయడంతో ఆ స్థానంలో తిరిగి ఎక్సైజ్ శాఖకు పూర్వ వైభవం తేనున్నారు. 2019 వరకు ఉన్న వ్యవస్థ మళ్లీ యథావిధిగా కొనసాగడం, ఎక్సైజ్ ఉద్యోగుల బదిలీలు ఈనెల 30లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం కోరడంతో ఆ మేరకు ఎక్సైజ్‌లో సరికొత్త ఎక్సర్‌సైజ్‌లు ప్రారంభమయ్యాయి. పాత మద్యం విధానమే తిరిగి రానున్నదనే ప్రచారంతో ఆ దిశగా తమకు సహకరించే అధికారుల కోసం ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యేలు జాబితా సమకూర్చుకున్నారు. ఈ తరహా పరిస్థితితో ఎక్సైజ్‌లో సీనియర్లు తాము కోరుకున్న స్థానం కోసం పట్టుపడుతున్నారు.

ఎస్ఈబీ రద్దుతో మాతృసంస్థ ఎక్సైజ్‌శాఖలోకి..

119 మంది ఎక్సైజ్ ఉద్యోగులు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 12: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏదో సాధించేద్దామని హడావుడి చేస్తూ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పేరుతో ఒక శాఖను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ఎక్సైజ్‌శాఖలో ఉన్న ఉద్యోగులలో 70 శాతం మంది ఉద్యోగులను ఎస్ఈబీలోకి బదిలీ చేశారు. పోలీస్ శాఖ నుంచి మాత్రం ఒక అదనపు ఎస్పీ, ఒక ఇన్‌స్పెక్టర్ మాత్రమే ఆ శాఖకు పంపించారు. ప్రతి జిల్లాకు ఎస్ఈబీని ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ నుంచి వచ్చిన అదనపు ఎస్పీ అధికారి పర్యవేక్షణలోనే ఈ ఉద్యోగులంతా విధులను జిల్లా వ్యాప్తంగా నిర్వర్తించారు. ఈ శాఖకు సత్ఫలితాలు లేకపోవడంతో టీడీపీ ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఈ శాఖను రద్దు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ శాఖలో ఉన్న ఉద్యోగులు తిరిగి మాతృ సంస్థలకు వెళ్లిపోవాల్సి ఉంది. జిల్లాలో పోలీస్‌శాఖ నుంచి వచ్చిన అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఇటీవల సీఐడీ విభాగానికి బదిలీ అయ్యారు. పోలీస్ శాఖ నుంచి వచ్చిన సీఐ తిరిగి తమ మాతృశాఖకు వెళ్లిపోయారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, తొమ్మిది మంది ఎక్సైజ్ సీఐలు, 16 మంది ఎక్సైజ్ ఎస్ఐలు, 80 మంది ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుళ్లు, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, మరో 12 మంది ఎక్సైజ్‌శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ ఎస్ఈబీలో పని చేస్తున్నారు. వీరంతా తిరిగి తమ మాతృసంస్థ అయిన ఎక్సైజ్ శాఖలోకి ఒకటి రెండు రోజుల్లో వెళ్లిపోనున్నారు. జిల్లాలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు, కైకలూరు, ఏలూరు, భీమడోలు, నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, పోలవరం ఉన్నాయి. ఈ స్టేషన్లలో ఆ సిబ్బంది అంతా చేరి విధులను నిర్వర్తించనున్నారు.

30 మంది టీచర్లు మెడికల్ లీవ్ !

- వంద కిలోమీటర్ల దూరానికి 'సర్దుబాటు'పై నిరసన బాట
- న్యాయం చేయాలని వేడుకోలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 12 : ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను నివారించేందుకు ఆయా పాఠశా లల్లో అదనంగా వున్న సర్‌ప్లస్ ఉపాధ్యాయులతో తాత్కా లికంగా సర్దుబాటు చేసేందుకు జిల్లాలో చేపట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ క్షేత్రస్థాయిలో పలువురికి దూరా భారమైనట్టు సంకేతాలు వస్తున్నాయి. పని సర్దుబాటు ప్రక్రియ షెడ్యూల్‌కు సవరణలు, అభ్యంతరాలు, వినతులు వంటివి స్వీకరణ, పరిష్కరించడం జరిగినా జిల్లాలో ముగి సిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో నూతనస్థానాలు కోరుకున్న 496 మంది ఉపాధ్యాయుల్లో ఇప్పటికే 30 మందికిపైగా సంబంధిత స్కూళ్లల్లో విధుల్లో చేరకుండా మెడికల్ లీవ్, తదితర కారణాలపై దూరంగా వున్నట్టు స్పష్టమైంది. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను తొలుత మండల పరిధి, ఆ తర్వాత డివిజన్ పరిధిలోనే ఉపాధ్యాయులకు అనువుగా ఉండేలా చేపడతామని విద్యాశాఖ చెప్పినా క్షేత్రస్థాయిలో పలువురు టీచర్లు ప్రస్తుత స్కూళ్ల నుంచి 60 - 100 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు వెళ్లక తప్పనిస్థితి నెలకొంది. దీనివల్ల వయస్సు పైబడిన ఉపాధ్యాయులు, ఉన్నత చదువులు చదివే పిల్లలున్న వారు, కుటుంబసభ్యులకు దూరంగా వెళ్లాల్సిన పరిస్థితులు రావడంతో కొందరు సర్దుబాటు స్థానాల్లో విధులు చేపట్టలేక సెలవు పెట్టినట్టు సమా చారం. ఇక ఏలూరు అర్బన్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయు ల్లో దాదాపు 11 మంది వర్క్ అడ్జస్ట్‌మెంట్ మార్గదర్శకా లను వ్యతిరేకిస్తూ తమను మున్సిపల్ ప్రాంత పాఠశాలల్లో కాకుండా రూరల్ మండలం, డివిజన్ పరిధిలోని మండ లాలకు సర్దుబాటు చేయడం నిబంధనలకు విరుద్ధమం టూ కోర్టును ఆశ్రయించడంతో పాటు, కొందరు సెలవుపై వెళ్లిపోవడం గమనార్హం. సర్దుబాటు నిబంధనలు సరిగా లేకపోవడమే దీనికి కారణమని ఉపాధ్యాయ సంఘాలు తొలుతనుంచీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఉన్న తాధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. కేవలం కొన్ని నెలల కాలానికి సుదూరప్రాంత పాఠశాలలకు సర్దుబాటు పేరుతో పంపించడం ఎంతవరకు సబబన్న ప్రశ్నలు టీచర్ల నుంచి ఎదురవుతున్నాయి. తమకు న్యాయం చేయాలని విద్యాశాఖ కమిషనర్‌కు పలువురు ఉపాధ్యాయులు అభ్యర్థనలు పెట్టుకున్నారు. మరోవైపు వర్క్ అడ్జస్ట్ మెంట్‌లో నూతనస్థానాలకు సర్దుబాటు అయిన టీచర్ల హాజరును ప్రస్తుత స్కూలు నుంచి తొలగించి, కొత్త స్కూలు హాజరుకు విద్యాశాఖ ఇప్పటికే చేర్చడం వల్ల మెడికల్ లీవును ముగించుకుని సర్దుబాటు స్కూలులో విధులు చేపడితేనేగాని పూర్తిస్థాయి జీతాలు అందుకోలేని సమస్య ఆయా ఉపాధ్యాయులకు తలెత్తే అవకాశాలు లేకపోలేదు.


శృంగవరప్పాడు-పైడిచింతపాడు రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న కొల్లేరు

ముంపులోనే కొల్లేరు

- బాహ్యప్రపంచంతో సంబంధాలు లేని కొల్లేటి లంక గ్రామాలు
- ఎగువ ప్రాంతాలనూ తాకుతున్న ముంపు
- కైకలూరును తాకిన ముంపు
- మోకాలు లోతు నీటిలో పెదనింద్రకొలను కాలనీవాసులు


చింతపాడులో ముంపు నీటిలో చిక్కుకున్న హైస్కూలు

కైకలూరు/మండవల్లి/నిడమర్రు, సెప్టెంబరు 12: కొల్లేరు లంక గ్రామాలు ముంపు నీటిలోనే మగ్గుతున్నాయి. తొమ్మిది రోజులుగా కొల్లేరు గ్రామాల్లోనికి నీరు వచ్చి ప్రజల రాకపోకల స్తంభించాయి. మండవల్లి మండలంలో కైకలూరు-ఏలూరు రోడ్డులో పెద్ద,చిన్నఎడ్లగాడి వద్ద వరద ఉధృతి తగ్గలేదు. దీంతో ఈ రహదారిలో రాకపోకలు నిలిపివేశారు. మండలంలోని పెనుమాకలంక, నందిగామలంక, శ్రీరామనగర్, ఇంగిలిపాకలంక, ,సుచ్చుమిల్లి, ఆనందపురం, తక్కెళ్ళపాడు, పులపర్రు, చింతపాడు, కొవ్వాడలంక గ్రామాల్లో రహదారులు నీటిలోనే ఉన్నాయి. కొల్లేరు ఎగువ గ్రామాలైన ఉనికిలి, మూలపేట, నాగభూషణపురం, లోకుముడి, చావలిపాడులోని పల్లపు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. పెద్దఎడ్లగాడి వద్ద కొద్దిమేర నీటి ఉధృతి తగ్గిందని అధికారు లు పేర్కొంటున్నప్పటికీ ఎగువ ఉన్న గ్రామాలను వరద చుట్టు ముట్టేసింది. కైకలూరు మండలంలోను వరద ఉధృతి భారీగానే ఉంది. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పెంచికలమర్రు, పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, కొట్టాడ జంగంపాడు, పల్లిపాలెం గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చొరవతో ఏర్పాటు చేసిన పడవలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు కొల్లేరు వరద ఉధృతితో వివిధ డ్రెయిన్లు, కాల్వలు పొంగి పొర్లడంతో వరద నీరు కైకలూరు పట్టణంలోనికి చేరింది. డ్రెయిన్లు పొంగి పొర్లడంతో కోర్టు రోడ్డు, కొత్తపేట, 7, 8 వార్డులు, బ్రహ్మంగారి గుడి వీధిలో రోడ్లు ముంపు బారినపడ్డాయి. నిడమర్రు మండలంలో మూడు రోజుల నుంచి రోజురోజుకు పెరుగుతున్న కొల్లేరు నీటిమట్టంతో కాల్వలన్నీ ఎగదన్నీ పొలాల్లోకి, కాలనీలలోకి వరద నీరు ప్రవేశిస్తోంది. పెదనింద్రకొలను పెద్దింట్లమ్మ కాలనీలోకి రెండు అడుగుల లోతున వరద నీరు రావడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లేందుకు పిల్లలను భుజాలపై ఎత్తుకుని ప్రధాన రహదారికి తీసుకొస్తున్నారు.


పెదనింద్రకొలను పెద్దింటమ్మ కాలనీ నీట మునగడంతో పిల్లలను ఎత్తుకుని స్కూల్‌కు తీసుకెళ్తున్న తండ్రి

గ్రామాల్లోకి ఉప్పుటేరు

కలిదిండి : కొల్లేరులో వరద నీరంతా ఉప్పుటేరులోకి చేరడంతో నీటిమట్టం రోజు రోజుకు పెరుగుతోంది. గురువారం ఉప్పుటేరు అమాంతంగా పొంగడంతో సున్నంపూడి, మద్వానిగూడెం, కొండంగి పల్లిపాలెంలో పలు ఇళ్లు నీటమునిగాయి. అంతర్గత రహదారులు జలమయమై ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. పాములు కూడా సంచరిస్తుండడంతో భయాందోళన చెందుతున్నారు. మునిగిన బాధితులను అధికారులు సున్నంపూడిలో పునరావాస కేంద్రానికి తరలిస్తున్నారు. మద్వానిగూడెం వంతెన సమీపంలో ఉప్పుటేరులో వరద నీరు రాష్ట్ర రహదారిపైకి సుమారు మూడు అడుగులు రావడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.


కొండంగి పల్లిపాలెం ఇళ్ల మధ్యకు చేరిన వరద నీరు

బొర్రంపాలెం పంచాయతీ..

సొమ్ములకు రెక్కలు..!

- గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎన్నిసార్లు విన్నవించినా పట్టని అధికారులు
- చివరకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు


వివరాలు తెలుపుతున్న పాండురంగ


బొర్రంపాలెం పంచాయతీ కార్యాలయం

టి.నరసాపురం, సెప్టెంబరు 12 : మండలంలోని బొర్రంపాలెం పంచాయతీలో కొందరు అడ్డగోలుగా నిధులను పక్కదారి మళ్లించారని, ఈ వ్యవహారంలో కొందరి అధికారుల సహకారం ఉందని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండే పాండురంగ ఆరోపించారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని, దీంతో గతనెల 21న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పోస్టుద్వారా ఫిర్యాదు పంపినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆ ఫిర్యాదు పత్రాలను గురువారం 'ఆంధ్రజ్యోతి'కి అందించి మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించగా పలు అంశాలు వెలుగు చూసినట్టు తెలిపారు. పంచాయతీలో స్వీపర్ పేరిట స్థానిక ఓ ప్రజాప్రతినిధికి ఎన్ఎంఆర్ వేతనం, ట్యాంక్ ఆపరేటర్ల వేతనం, ఇతరత్రా లక్షలాది రూపాయలు ఆ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడు, ఒక అధికారి, మరికొందరు పంచుకున్నట్టు ఆయన ఆరోపించారు. పంచాయతీలో 2021 -22, 23-24 సంవత్సరాలకు సంబంధించి ఇంటిపన్ను, పన్నేతరాలను (బకాయిలతో సహా) సుమారు రూ.15 లక్షల వరకు వసూలు చేశారని, ఆ మొత్తాన్ని సబ్‌ట్రెజరీలో జమ చేయాల్సి ఉండగా, జమ చేయకుండా వివిధ ఖర్చులకు నేరుగా చెల్లించినట్టుగా చెబుతున్నారని పేర్కొన్నారు. గ్రీన్‌వెహికల్స్‌కు సంబంధించి 2014-15 సంవత్సరంలో వాహనాన్ని పొటేళ్ళ సూర్యనారాయణ, మరొకరి పేరున రెండు వాహనాలు కొనుగోలు చేశారని, వాటికి చెల్లించాల్సిన వాయిదాను మరొకరి ఖాతాకు రూ.36,407లను బదిలీ చేసినట్టు ఆరోపించారు. మోటారు ఆపరేటర్ చనిపోగా అతనికి చెల్లించాల్సిన వేతనాన్ని పక్కదారి పట్టించారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో హ్యాండ్‌బోర్లు లేకపోయినా మరమ్మతుల నిమిత్తం, పనిముట్లు నిమిత్తం రూ.3.50 లక్షలు ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారని ధ్వజమెత్తారు. గ్రామంలో పలుచోట్ల చేయని గ్రావెల్ రోడ్లను వేసినట్టుగా నమోదు చేసి సొమ్ములు డ్రా చేశారన్నారు. జల జీవన్‌మిషన్ పథకం ద్వారా నిధులు దుర్వినియోగమైనట్టు ఆరోపించారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరిపించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పాండురంగతో పాటు పలువురు కోరుతున్నారు. నిధుల దుర్వినియోగంపై పంచాయతీల విస్తరణ అధికారి రామ్‌ప్రసాద్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, తాను ప్రస్తుతం కుక్కునూరు గోదావరి వరద సహాయ కార్యక్రమాల్లో ఉన్నానని, త్వరలోనే విచారణ చేపడతామన్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయంవద్ద పీహెచ్‌సీల వైద్యాధికారుల నిరసన

జీవో 85 నిలిపివేయాలి

- ప్రభుత్వ వైద్యాధికారుల అల్టిమేటం
- పీజీ వైద్యవిద్య కోర్సుల్లో పాత విధానంలోనే ఇన్‌సర్వీస్ రిజర్వేషన్లకు డిమాండ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 12 : వైద్యవిద్య పీజీ కోర్సుల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ వైద్యులకు ఇప్పటి వరకు వున్న రిజర్వేషన్లను సగానికి తగ్గిస్తూ రాష్ట్రప్రభుత్వం ఇటీవల జారీచేసిన జీవో 85 ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల (హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు) వైద్యాధికారులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గవర్నమెంట్ సర్వీసులో వున్న డాక్టర్లకు పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో క్లినికల్ విభాగం కోర్సుల్లో 30 శాతం, నాన్-క్లినికల్ విభాగం కోర్సుల్లో 50 శాతం సీట్లను దశాబ్దాల కాలంగా రిజర్వ్ చేసి కేటాయిస్తున్నారని, దీనికి భిన్నంగా జీవో 85 ఉత్తర్వులతో ఇన్‌సర్వీస్ రిజర్వేషన్లను 15 శాతం, 30 శాతం సీట్లకే పరిమితం చేయడం అన్యాయమని ఏపీ ప్రైమరీ హెల్త్‌సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచంద్రకుమార్ విమర్శించారు. ఆందోళనలో భాగంగా ఈ నెల 13న జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో కాన్ఫరెన్సులు, టెలీ కాన్ఫరెన్సులు, జూమ్ మీటింగ్‌ల బహిష్కరణ, అధికారుల వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలగడం, 14న అత్యవసర కేసులకే హాజరు, 15న వైద్యఆరోగ్యశాఖ డైరెక్టరేట్‌కు చలో విజయవాడ ర్యాలీ, 16నుంచి ఆమరణ నిరాహారదీక్షలను డిమాండ్లు నెరవేరేవరకు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. నీట్-పీజీ అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూలును విడుదల చేయకముందే జీవోను తక్షణమే నిలిపివేయడంతో పాటు, ప్రభుత్వం బహిరంగ చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో వినతిపత్రం ఇవ్వకుండానే వెనుదిరిగారు.

నెమ్మదిగా తగ్గుతున్న గోదావరి


వేలేరుపాడు సమీపంలో వరద

కుక్కునూరు/వేలేరుపాడు/ పోలవరం, సెప్టెంబరు 12 : గోదావరి వరద నెమ్మదిస్తోంది. గురువారం ఉదయం భద్రాచలం వద్ద 43.6 అడుగుల నీటిమట్టం నమోదు కాగా సాయంత్రానికి 41.3 అడుగులకు చేరుకుంది. అయితే శబరి వరద పోటుతో కుక్కునూరు మండలంలో వేగంగా వరద తగ్గడం లేదు. మరోవైపు కుక్కునూరు- భద్రాచలం వైపుగా రాకపోకలు కొనసాగుతున్నాయి. వరదతో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. తీర ప్రాంతంలో వెయ్యి ఎకరాల్లో మిర్చి సాగు చేపట్టగా 600 ఎకరాలకు పైగా నీట మునిగింది. వేలేరుపాడు మండలంలో ఇంకా తగ్గక పోవడంతో సుమారు 30 గ్రామాలకు వరదపోటు ఉంది. కొంతమేర తగ్గిన రహదారులన్నీ నీట మునిగి పోవడంతో బుధవారం సాయంత్రానికి కూడా మండల కేంద్రానికి రాక పోకలు నిలిచిపోయాయి. ప్రజలు నాటుపడవలు ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు వద్ద వారం రోజులుగా పెరిగిన గోదావరి గురువారం నాటికి తగ్గు ముఖం పట్టింది. కడెమ్మ స్లూయిజ్ వద్ద గోదావరి వరద జలాలు గేట్లను ముంచెత్తి ఉంచడంతో పంట పొలాల్లో వరద జలాలు గోదావరిలోకి వెళ్లే మార్గం లేక పంటపొలాలు నీట మునిగి ఉన్నాయి. కడెమ్మ వంతెన వద్ద వరద జలాలు తగ్గడంతో ప్రాజెక్టు అధికారులు, కార్మికుల వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 11,66,581 క్యూసెక్కుల జలాలు విడుదల చేశారు. కొవ్వాడ రిజర్వాయర్ నీటిమట్టం 89.75 మీటర్లు నమోదు కాగా 360 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేశారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆట్యా పాట్యా జిల్లా జట్టుతో నిర్వాహకులు

ఆట్యా పాట్యా జూనియర్స్ జిల్లా జట్టు ఎంపిక

భీమవరం అర్బన్, సెప్టెంబరు 12: ఆట్యా పాట్యా జూనియర్స్ జిల్లా బాలురు, బాలిక జట్టు ఎంపికను భీమవరంలోని చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూలులో గురువారం నిర్వహించారు. ఈ పోటీలో సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీలలో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా ఆట్యాపాట్యా అసోసియేషన్ అధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు, కార్యదర్శి కిరణ్ వర్మ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు జీపీసీ శేకర్ రాజు, రామభద్రంరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



తణుకు, సెప్టెంబరు 12: ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. తణుకు చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. బి.నాగలక్ష్మీదుర్గ కె.జ్యోతి బహుమతులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థినులు, పీడీ రత్నకుమారిని జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు అభినందించారు.



ఎన్‌బీఏ గుర్తింపు పత్రంలో కళాశాల యాజమాన్యం

స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 12: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలకు జాతీయ స్థాయిలో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రెడిడేషన్ (ఎన్‌బీఏ) టైర్ వన్ గుర్తింపు లభించింది. గురువారం కళాశాలలో విలేకర్ల సమావేశంలో చైర్మన్ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్,ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గోపిచంద్‌లు మాట్లాడుతూ ఎన్‌బీఏ ఛైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులు ఈ ఏడాది జూలై నెలలో కళాశాలను సందర్శించారన్నారు. మౌలిక వసతులు, ఉపాధి, సిలబస్, డిజైన్, విద్యా ప్రమాణాలు, ఉత్తీర్ణత, క్రమశిక్షణ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఎన్‌బీఏ ఈ గుర్తింపు ఇచ్చిందన్నారు. ఇప్పటికే న్యాక్, అటానమస్ గుర్తింపులు ఉన్నాయన్నారు. డైరెక్టర్లు శ్రీహరి, పీవీఆర్, బాబు, హెచ్‌వోడీ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఇతర రాష్ట్రాల రైతులకు శిక్షణ

ఉంగుటూరు, సెప్టెంబరు 12 : రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య (ఏలూరు) సహకారంతో ఇతర రాష్ట్రాల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నారు. గురువారం ఏలూరు జిల్లాలో చందు ఆధ్వర్యంలో సంబంధిత బృందం ఉంగుటూరు, నాచుగుంట, వెల్లమిల్లి గ్రామాలలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. మాస్టర్ ట్రైనర్ గద్దే రత్నాజి పలు అంశాలపై సలహాలు సూచనలు అందించారు. వెల్లమిల్లి పరిమి రాజేంద్ర క్షేత్రంలో వివిధ కూరగాయల పంటల సాగును పరిశీలించారు

నేటి నుంచి పాలకొల్లు చినగోపురంలో పవిత్రోత్సవాలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 12 : వైష్ణవ క్షేత్రం అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం (చిన్న గోపురంలో) 13వ తేదీ శుక్రవారం నుంచి స్వామివారి పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈవో బిరుదుకోట సత్యనారాయణ శంకర్ తెలిపారు. 13వ తేదీ శుక్రవారం సాయంత్రం అంకురార్పణ, 14వ తేదీ ఉదయం శ్రీలక్ష్మీ నృసింహ హవనం, సాయంత్రం గరుడ వాహనసేవ, 15వ తేదీ ఉదయం తిరుమంజనం, సాయంత్రం పవిత్ర సమర్పణలు, 16వ తేదీ ఉదయం మహాలక్ష్మీ హవనం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నకూటోత్సవం, సాయంత్రం పవిత్ర వితరణ, 17వ రోజు ఉదయం అలంకార తిరుమంజనం, శాంతి కల్యాణం, సాయంత్రం శ్రీవారి రథోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

స్మార్ట్ మీటర్స్ వచ్చేస్తున్నాయి

మొదటగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు

భీమవరం టౌన్, సెప్టెంబరు 10 : ప్రభుత్వ కార్యాలయాలకు త్వరలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత మీటర్ల స్థానంలో వీటిని ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు సర్వే చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన వెంటనే జిల్లాలోని 6,445 ప్రభుత్వ కార్యాలయాల్లో మీటర్లను ఏర్పాటు చేస్తారు. స్మార్ట్ మీటర్లను మూడు విడతల్లో ఏర్పాటు చేస్తారు. మొదట ప్రభుత్వ కార్యాలయాలకు, రెండో విడత వాణిజ్య విభాగాలకు, చివరగా వినియోగదారుల ఇళ్ళకు ఏర్పాటు చేయనున్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే కరెంటు బిల్లులు పెరుగుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ అలాంటిది ఏమీ ఉండదని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. మీటరుకు సంబంధించిన సొమ్ము ఎవరు ?ఎలా చెల్లించాలి ? బిల్లులకు సంబంధించి ఎన్నో విషయాలపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తారు. స్మార్ట్ మీటర్‌లో సిమ్ కార్డు వేసుకుంటే ప్రీపెయిడ్ మీటర్‌గా మార్చుకునే అవకాశం కూడా ఉంటుంది.స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగంపై ఏరోజు సమాచారం ఆ రోజు రావడంతో పొదుపుగా వాడుకునే అవకాశం ఉంటుంది. స్లాబ్‌లు దాటకుండా చర్యలు తీసుకుని సొమ్ములు ఆదా చేసుకోవచ్చు.

టీడీపీ నాయకుని మోటాల్ సైకిళ్లు దగ్ధం



తణుకు, సెప్టెంబరు 12 : తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ రెడ్డి నరేంద్రప్రసాద్ ఇంటి ముందు ఉన్న రెండు స్కూటీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. నరేంద్రప్రసాద్ ఇంటి ముందు ఉంచిన రెండు స్కూటీలను గుర్తు తెలియని వ్యక్తులు తగల పెట్టినట్లు ఆయన రూరల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ వీధిలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీ పూర్తిగా పరిశీలించారు. వీరభద్రపురానికి చెందిన రాజేష్, మేకర్, మండపాకకు చెందిన జానులను అనుమానితులుగా గుర్తించామన్నారు. పూర్తిస్థాయి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ చంద్రశేఖర్ చెప్పారు.

దంపతులకు పాము కాటు.. అస్వస్థత



పోలవరం, సెప్టెంబరు 12 : పాము కాటుతో వ్యవసాయ కూలీ దంపతులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన పోలవరం మండలం పట్టిసీమలో గురువారం జరిగింది. పాత పట్టిసీమకు చెందిన కాత్రు శ్రీను, బుజ్జి పొలానికి వెళ్లి పని చేస్తుండగా పాముకాటు కాటు వేయడంతో బుజ్జి వెంటనే గట్టిగా అరిచి కిందపడిపోయింది, కిందపడిపోయిన భార్యను లేపడానికి వెళ్లిన భర్తను అదే పాము కాటు వేయడంతో ఇద్దరూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్పందించిన సాటి కూలీలు వారిని పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యాధికారి కృష్ణంరాజు వారికి ప్రథమ చికిత్స అందించారు. వైద్యాధికారి మాట్లాడుతూ కరిచిన పాము విషపూరితమైనది కాదని, ప్రాణా పాయం లేదని తెలిపారు. వ్యవసాయ కూలీలు, రైతులు ఈ వర్షాల సీజనులో విష కీటకాలు, పాముల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని పాముకాటు వేసిన వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి చేరుకుని వైద్యం పొందాలని ప్రభుత్వ ఆసు పత్రిల్లో పాముకాటు విరుగుడు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 12 :తెలంగాణ నుంచి అక్రమంగా 15 మద్యం బాటిళ్లు తెస్తున్న వ్యక్తిని పోలీస్‌లు పట్టుకుని కేసు నమోదు చేశారు. పి.రాజవరం గ్రామానికి చెందిన స్వయంవరపు సూరిబాబు 15 ఓల్డ్ అడ్మిరాల్ క్వార్టర్ బాటిళ్లు తీసుకుని సంచిలో ఉంచి తాటియాకులగూడెం సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నడుచుకుంటూ వెళుతుండగా అనుమానం వచ్చి పోలీస్‌లు తనిఖీ చేశారు. సంచిలో తెలంగాణ మద్యం బాటిళ్లు 15 ఉండటంతో వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ చెప్పారు.

వణికిస్తున్న జ్వరాలు



వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నాయి. ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. మొన్నటి వరకు డెంగీ జ్వరాలతో ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అవి తగ్గుముఖం పట్టినా వైరల్ ఫీవర్స్ వెంటాడుతున్నాయి. ప్రతీ ఇంటిలోను జ్వర పీడితులు ఉంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న సర్వేలో కూడా జ్వరాలకు సంబంధించి పీహెచ్‌సీలో పరిధిలో 10 నుంచి 15 వరకు నమోదవుతున్నాయని చెబుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ఈ జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని చెబుతున్నారు.

విజృంభిస్తున్న వైరల్ ఫీవర్స్

ఎక్కువగా టైఫాయిడ్ కేసులు

రోగులతో ఆసుపత్రులు కిటకిట

భీమవరం టౌన్, సెప్టెంబరు 12 :

కొవిడ్‌లాగే జాగ్రత్తలు పాటించాలి

కోవిడ్ వచ్చినపుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకున్నామో అలాంటివే పాటించాలని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు. వైరల్ జ్వరాలు కావటంతో వాటిని అరికట్టలాంటే జాగ్రత్తలు అవసరం. జ్వరం వచ్చినవారు ఉపయోగించిన వస్తువులు వాడకపోవటం, దగ్గు, తుమ్ములు వచ్చినపుడు చేయి అడ్డుపెట్టుకోవటం, మాస్క్ ధరించటం, వంటివి వాడితే తొందరగా అరికట్టవచ్చనని చెబుతున్నారు. జ్వరం వచ్చినవారు బయట తిరగకుండా ఇంటి వద్దనే ఉండాలి. కాచి వడగట్టిన నీటిని తాగటం వల్ల కూడా కొంత అరికట్టవచ్చనని చెబుతున్నారు.

ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల తనిఖీ

ఎక్కువగా జ్వరాలు వచ్చే గ్రామాల్లో వాటర్ ప్లాంట్లలో నీటిని తనిఖీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. నరసాపురం, పెనుమంట్ర మండలం ఆలమూరు, తాడేపల్లిగూడెం రూరల్ మండలం, అత్తిలి ప్రాంతాల్లో జ్వరాలు ఎక్కువగా ఉంటున్నాయని అందువల్ల అక్కడ నీటిని పరిశీలించామన్నారు. వీరవవాసరం మడలం కొణితివాడ పీహెచ్‌సీ పరిధిలో ఒక వాటర్ ప్లాంట్‌లో ఇబ్బందులు ఉన్నటుగా నివేదిక రావడంతో ప్లాంట్‌ను మూయించి వేసినట్టు తెలిపారు. పూర్తిస్థాయిలో శుభ్రం చేసిన తరువాత నీటిని తనిఖీ చేసి పరిశుభ్రంగా ఉన్నట్లు నివేదక వస్తేనే సరఫరా చేసేందుకు అనుమతి ఇస్తామన్నారు.

ప్రజల్లో అవగాహన

వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటిని కాచుకుని తాగలాలని, దోమలు రాకుండా చూసుకోవాలని, జ్వరాలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచిస్తున్నారు. ఎక్కువగా దగ్గు, రొంప, తీవ్రమైన జ్వరం వస్తోందని, మూడు రోజుల పాటు ఉం టుందని అప్పటికీ తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

ప్లేట్ లెట్స్.. తగ్గిపోతే..



ప్రభుత్వ ఆసుపత్రిల్లో జ్వరాల్లో ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్న రోగుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సూచనలు అందిస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. 70 వేల కంటే కౌంట్ తక్కువగా ఉంటే వెంటనే జిల్లా ఆసుపత్రులకు సంబంధిత రోగిని తరలించి మెరుగైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. దీనివల్ల రోగికి ఇబ్బంది కలగకుండా ఉంటుంది. డెంగీ లక్షణాలు ఉన్నట్లుగా ప్రైవేట్ హస్పటల్‌లో చేరే రోగికి సంబంధించిన బ్లడ్ శ్యాంపిల్ ఇవ్వాలని కూడా ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.



అత్తిలిలో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు

అత్తిలిలో ఆందోళన

జ్వరాలతో ఇద్దరి మృతిపై గ్రామంలో భయం..

అత్తిలి : అత్తిలిలో డెంగీ జ్వరాలతో మొన్న చిన్నారి మృతి చెందగా, నేడు 17 ఏళ్ళ యువకుడు చనిపోవడంతో పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. మండలంలోని గ్రామాల్లో కూడా డెంగీ జ్వరాల ప్రభావం అధికంగా కనిపి స్తున్నది. గ్రామాల్లో జ్వరాలతో సతమతమవుతున్నారు. అత్తిలి, మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కంటే ప్రైవేటు డాక్టర్లనే ఎక్కువగా ఆశ్రయిస్తు న్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు జ్వరాలతో సతమత మవుతున్నారు. ఎక్కడ చూసినా అనారోగ్య సమస్యలతో ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో రక్త పరీక్షలు చేయక పోవడం, అవగాహన కల్పించడంలో వైద్యులు విఫలమవుతున్నారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వాటికి రక్త పరీక్షలు చేయకపోవడంతో ప్రైవేటు వైద్య లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులు అడ్డగోలుగా దోచు కుంటున్నారు. రకరకాల పరీక్షలు చేసి రోగులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మాత్రం నామ మాత్రంగానే ఉంది. దోమల నివారణకు గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలను ఉపయోగించి కట్టడి చేయాల్సి ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా మూలన చేర్చారు. మొక్కుబడిగా నీటి నాణ్యతా పరీక్షలు చేస్తున్నారు.

పరిశీలించిన వైద్యాధికారులు

అత్తిలి మండలంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ఏ గృహాన్ని సందర్శించినా జ్వరపీడితులు ఉన్నారు. జ్వరాలకు తోడు విపరీతమైన నొప్పులతో బాధపడుతున్నారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్ ప్రసాద్, అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో అమీలుజమా, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు జ్వరాలతో మృతి చెందిన వారి ఇండ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ సర్వే, యాంటి లార్వా ఆపరేషన్ పరిశీలించారు. హెల్త్ అసిస్టెంట్స్, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు ప్రతి రోజూ ఫీవర్ సర్వే చేయాలన్నారు.

ప్రభుత్వ సాయం రైతులకు అందాలి

భారీ వర్షాలు, వరదల్లో అధికారుల సేవలు అభినందనీయం

స్థాయి సంఘ సమావేశాల్లో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 12:ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు వల్ల జిల్లాలో పంట నష్టం జరిగిందని దీని నిమిత్తం ప్రభుత్వం కల్పిస్తున్న సహాయాన్ని రైతాంగానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. గురువారం జడ్పీ కార్యాలయంలో జరిగిన స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల వల్ల నష్టపోయిన వారందరికీ , నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం కల్పిస్తున్న సాయం ప్రతి ఒక్కరికి అందేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలులో జిల్లా అధికారులు స్ఫూర్తిదాయకంగా పనిచేస్తున్నారని చైర్ పర్సన్ అధికారులను అభినందించారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడుతూ ప్రతినెలా 1వ తేదీనే సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందితో పెన్షన్లు పంపిణీ పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో హౌసింగ్‌కు సంబంధించిన 2014-2019 సంవత్సరంలో ఎన్‌టీఆర్ గృహ యాప్‌లో నమోదు చేసిన బిల్స్‌ను ఆన్‌లైన్ చేస్తున్నామని దీనిని కొత్త స్కీంలో పెడుతున్నట్టు హౌసింగ్ అధికారులు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 93 లక్షల 75 వేల పని దినాలను కల్పించామని, 3 లక్షల 72 వేల మందికి జాబ్‌కార్డులు ఇచ్చామని ,



రెసిడెన్షియల్ స్కూల్స్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే



జడ్పీ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ , వివిధ శాఖల అధికారులు

జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి 500 ఎకరాల్లో గ్రౌండ్ లెవెల్ చేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ శిథిలమైన దేవాలయాలను పునరుద్ధరించటానికి ప్రజల భాగస్వాముల నిధులతో పాటు సీజీఎఫ్ అక్కౌంట్ కింద నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. టీటీడీ ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాల్లో దేవాలయాల నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

ఫోన్ చేసినా స్పందించరా : ఎమ్మెల్యే బొలిశెట్టి

వివిధ సమస్యలపై ఫోన్ చేసినా స్పందించకపోవడం, తాము అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో రెసిడెన్షియల్ స్కూల్స్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్‌పై తాడేపల్లిగూడెం, చింతలపూడి ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సమావేశానికి ప్రిపేర్డై రాలేదని ఆ మహిళా అధికారి చెప్పిన సమాధానికి వారు ఆశ్చర్యపోయారు. గత ఐదేళ్లలో ఎంత మంది పిల్లలకు కొత్తగా సీట్లు ఇచ్చారు ? రెసిడెన్షియల్ స్కూల్స్‌లో మెనూ ఎలా అమలవుతోందని ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. తాడేపల్లిగూడెంలో ఐదు ఎకరాల భూమి ఉందని అందులో రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని లెటర్ పంపాను ఏం చర్యలు తీసుకున్నారని బొలిశెట్టి ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఏమైనా కోచింగ్ ఇస్తున్నారా అని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రశ్నించారు. సమావేశాల్లో జడ్పీ సీఈవో సుబ్బారావు, డిప్యూటీ సీఈవో నిర్మలాజ్యోతి, వివిధ మండలాల జడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పి.అంకంపాలెంలో వేలంలో పొందిన లడ్డూతో భక్తులు

20 కేజీల లడ్డూ.. రూ.3.80 లక్షలు

జీలుగుమిల్లి/కాళ్ల సెప్టెంబరు 12:పి.అంకంపాలెం వినాయక యూత్ సభ్యులు లడ్డూ వేలం వేయగా రూ.3.80 వేలకు భక్తులు దక్కించుకున్నారు. జీలుగుమిల్లిలో శొంఠి మురళి రూ.50,116కు లడ్డూ పాట పాడారు. జీలుగుమిల్లిలో ఆర్య వైశ్య సిద్ది వినాయక యూత్ ఆధ్వర్యంలో ఉదయ్‌భాస్కర్ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల్ని గురువారం బుడుగుల చెరువులో నిమజ్జనం చేశారు. చిత్తపూడి పవన్, కొప్పుల నాగరాజు, యార్లగడ్డ శివ, పసుపులేటి బాలాజీ, పేరాబత్తుల గంగాధర్ పాల్గొన్నారు. కాళ్లలో స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం వేయగా రూ.లక్షా 30 వేలకు దక్కించుకున్నారు.ధర్మకర్త మంతెన సాయికృష్ణంరాజు లడ్డు ప్రసాదం అందించారు.



కాళ్లలో లడ్డూ ప్రసాదం దక్కించుకున్న భక్తులు



చోరీ సొత్తును చూపుతున్న ఏలూరు ఎస్పీ కిషోర్

ముగ్గురు దొంగల అరెస్టు

రూ.పది లక్షల 78 వేల సొత్తు స్వాధీనం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 12 : తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో రాత్రివేళ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను పెదవేగి సర్కిల్ పోలీసు సిబ్బంది అరెస్టు చేశారని ఎస్పీ కిషోర్ చెప్పారు. పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళ్ళమూడిలో తాళం వేసి ఉన్న ఇంటిని ఈఏడాది మే 29న రాత్రి వేళ పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఈ ఘటనపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదవేగి సీఐ అబ్దున్‌నబీ, ఏలూరు సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, పెదపాడు ఎస్‌ఐ సుభోశేఖర్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈనెల 11వ తేదీ అర్ధరాత్రి కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక మోటారు సైకిల్‌పై వస్తున్న ముగ్గురుని ఆపగా వారు పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసు కుని విచారించారు. విజయవాడ చిట్టినగర్‌లోని రామరాజ్‌నగర్‌కు చెందిన పేకేటి వెంకటరెడ్డి (36), నూజివీడు మండలం సీతారాంపురం గ్రామానికి చేకూరి వెంకటరెడ్డి (35) విజయవాడ కేపీ రోడ్డు కొత్తపేటకు చెందిన షేక్ అల్లా భక్షు (39)లను విచారించారు. ఈ ముగ్గురు తాళ్ళమూడిలో దొంగతనంతో పాటు పెదపాడులో మరో మూడు ఇళ్ళ దొంగతనాలు చేశారని నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో మూడు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. వారి నుంచి 82 గ్రాముల బంగారపు వస్తువులు, నాలుగు కేజీల 756 గ్రాముల వెండి వస్తువులు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. చోరీ సొత్తు మొత్తం 10 లక్షల 78 వేలు రూపాయలని తెలిపారు. ఎస్‌ఐ సుభోశేఖర్, పెదవేగి సర్కిల్ టీమ్, ఏలూరు సీసీఎస్ ఎస్‌ఐ చంద్రశేఖర్‌లను, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చెయిన్ స్నాచర్ అరెస్ట్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 12 : రోడ్డుపై నడిచి వెళ్తున్న ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును తెంపుకుని మోటారు సైకిల్‌పై పారిపోయిన ఒక వ్యక్తిని ఏలూరు వన్‌టైన్ పోలీసులు అరెస్టు చేశారని ఎస్పీ కిషోర్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి రైతు భరోసా కేంద్రం సమీపంలో నివాసం ఉంటున్న చింతపల్లి సూర్యకుమార్ (33) ఈనెల 4వ

క్రైం కార్నర్..

తేదీ ఉదయం రోడ్డుపైన నడిచి వెళ్తున్న ఒక మహిళ మెడలోని బంగారపు చైన్ మోటారు సైకిల్‌పై వచ్చి తెంపుకుని పారిపోయాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వన్ టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మదీనాబాషా, కానిస్టేబుళ్ళు మోహన్ కృష్ణ, నాగార్జున, లక్ష్మీనారాయణ, గణపవరం సీఐ సుభాష్, హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు నిఘా ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం ఏలూరు గడియార స్తంభం వద్ద మోటారు సైకిల్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న సూర్యకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతని నుంచి 33 గ్రాముల బంగారం (రెండున్నర లక్షల రూపా యలు) స్వాధీనం చేసుకున్నామని నేరానికి వినియోగించిన మోటారు సైకిల్ స్వాధీనం చేసు కున్నామన్నారు. ఎస్పీతో పాటు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, పెదవేగి సీఐ అబ్దుల్ నబీ, గణపవరం సీఐ సుభాష్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



అనిల్(ఫైల్)

టి.నరసాపురం, సెప్టెంబరు 12: ఆర్థిక ఇబ్బందులు భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు టి.నరసాపురం పరిధిలోని ఎర్రచెరువు కాలనీకి చెందిన పరసా ఏసు కుమారుడు అనిల్ (26) ఉదయం 6.30 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దాడి కేసులో మూడేళ్ల జైలు శిక్ష

ఏలూరు క్రైం, సెప్టెంబరు 12 : ఒక వ్యక్తిని కర్రతో దాడి చేసి చేయి విరగ గొట్టిన ఒక వ్యక్తిపై నేరం రుజువు కావడంతో అతనికి మూడు సంవత్సరాల 15 రోజులు జైలు శిక్ష, ఆరు వేల 500 రూపాయలు జరిమానా విదిస్తూ ఏలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాసుదేవ్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఏలూరు సత్యనారాయణ పేటకు చెందిన బడిగంటల లీలారాజు (24) 2022 సెప్టెంబరు 22న ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు.దీనిపై ఆమె భర్త ప్రశ్నించగా లీలారాజు కర్రతో కొట్టి చేయి విరగగొట్టాడు. ఈ సంఘటనపై వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ కేసు నమోదు చేయగా అప్పటి ఎస్‌ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ హేమలత వాదించగా ప్రాసిక్యూషన్‌కు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ,ఎస్‌ఐ మదీనాబాషా,కోర్టు కానిస్టేబుల్ సంగయ్య సహకరించారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 12: నిమ్మలగూడెం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై కంకిపాటి నాగరాజు (48) చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. నాగరాజుకు నిమ్మలగూడెంలో కొంత పొలం ఉంది. పొలంలో ఉన్న విద్యుత్ స్తంభంపై నుంచి మోటారుకు వెళ్ళే విద్యుత్ తీగలకు కనెక్షన్ ఇవ్వడానికి గురువారం ఉదయం తన కుమారుడు జ్యోతిరాదిత్య, మరో వ్యక్తి బుగ్గా సత్యనారాయణతో పాటు వెళ్ళారు. వైర్లను స్తంభంపై కనెక్ట్ చేయడానికి విద్యుత్ లైన్‌మేన్‌కు ఫోన్ చేయగా హెల్పర్ రామారావును పంపారు. అనంతరం వైర్లను కనెక్ట్ చేయడానికి విద్యుత్ సరఫరాను (ఎల్‌సి) నిలిపివేయాలని లైన్‌మ్యాన్‌కు ఫోన్ చేయగా ఆయన ఎల్‌సి ఓకే అయ్యిందని చెప్పారు. స్తంభంపై వైర్లు బిగించడానికి నిచ్చెన వేసుకుని ఉన్న హెల్పర్ రామారావుకు నాగరాజు, అతని కుమారుడు జ్యోతి రాదిత్య సత్యనారాయణ విద్యుత్ వైర్లను అందిస్తుండగా ఒకేసారి విద్యుత్ సరఫరా అవడంతో నాగరాజు అక్కడిక్కడే మృతి చెందగా అతని కుమారుడికి రెండు చేతులకు, ఎడమ కాలికి గాయాలయ్యాయి. మరొక వ్యక్తి సత్యనారాయణ స్పృహ తప్పి పడిపోయారు. విద్యుత్ శాఖ సిబ్బంది అసనత్వం వల్లనే తన తండ్రి మృతి చెందాడని తమకు గాయాలయ్యాయని మృతుని కుమారుడు జ్యోతిరాదిత్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

యలమంచిలి, సెప్టెంబరు 12: ఇటీవల ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడిన కంచుస్తంభంపాలెం గ్రామానికి చెందిన కె.కె.ఎస్ వెంకటేశ్వరరావు(62) భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ గుర్రయ్య తెలిపారు. వెంకటేశ్వరరావు ఆగస్టు 31న బైక్‌పై పాలకొల్లు నుంచి ఇంటికి తిరిగి వెళుతుండగా దొడ్డిపట్ల ప్రధాన కూడలి సమీపంలో కళ్లు తిరగడంతో పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న అతని బంధువులు మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరంలోని ఒకప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరావు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ఉండి, సెప్టెంబరు 12 : భార్యను చంపిన కేసులో భర్త గొల్ల చిరంజీవిని అరెస్టు చేసినట్టు ఆకివీడు సీఐ జగదీశ్వరరావు తెలిపారు. ఈ నెల 5న ఉండి మండలం కలిగొట్లలో చిరంజీవి తన భార్య సత్యవతిని హత్య చేశాడు. ఈ కేసులో నిందితుడు చిరంజీవిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు. కోర్టు రిమాండ్ విధించిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. నలుగురికి గాయాలు

అత్తిలి, సెప్టెంబరు 12 : అత్తిలి గ్రామం రామన్నపేట ఐశ్వర్య దుర్గమ్మ ఆలయం వద్ద ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. గురువారం రాజోలుకు చెందిన దంపతులు తాడేపల్లిగూడెం శుభకార్యానికి వెళ్ళి తిరిగి వస్తుండగా అత్తిలి రామన్నపేటకు చెందిన ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొట్టడంతో బైక్‌లపై ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తణుకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



ఏలూరు సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు




కలెక్టర్ వెట్రి సెల్వికి విరాళాలు అందిస్తున్న పారిశ్రామికవేత్తలు.. ఎమ్మెల్యే బడేటి చంటికి చెక్కు అందిస్తున్న నగరవాసులు.. మంత్రి లోకేశ్‌కు విరాళం అందిస్తున్న మేకా వినయ్‌బాబు

వరద బాధితులకు విరాళాల వెల్లువ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 12: విపత్తుల పరిస్థితులలో వరద బాధితులను ఆదుకోవటంలో పారిశ్రామికవేత్తల స్పందన అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి పేర్కొన్నారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునే క్రమంలో పెదపాడు మండలం ఏపూరుకు చెందిన స్నేహ ఫారమ్స్ ప్రైవేటు లిమిటెడ్ (పౌల్ట్రీ ఫీడ్‌మిల్) కంపెనీకి చెందిన ప్లాంట్ మేనేజర్ కె శ్రీనివాసరెడ్డి , అసిస్టెంట్ మేనేజర్ కుమార్, సేఫ్టీ అధికారి ఆర్ దినేష్ రూ. 5లక్షలు చెక్‌ను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఉంగుటూరుకు చెందిన గ్రీన్ ఆసియా ఇన్‌ఫెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రాన్ ప్రాసెసింగ్) తరపున జనరల్ మేనేజర్ కేవీ ప్రకాశరెడ్డి, హెచ్‌ఆర్ వి.సత్యనారాయణ రూ. 3లక్షల చెక్‌ను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

సీఆర్‌ఆర్ విరాళం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 12 : రాష్ట్రంలో వరద నివారణ చర్యలు, వరద బాధితులకు మెరుగైన సదుపాయాల కల్పన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్థానిక సీఆర్‌ఆర్ విద్యాసంస్థల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ అల్లూరి ఇంద్రకుమార్ రూ. 2కోట్లు, ఉపాధ్యక్షుడు ఏ.వి.సుబ్రహ్మణ్యం రూ. కోటి, గవర్నింగ్ బాడీ సభ్యులు వెలమాటి జనార్దనరావు రూ. కోటి, డాక్టర్ వి.వి.బాలకృష్ణారావు రూ. 5లక్షలు, సిబ్బంది, మేనేజ్‌మెంట్ రూ. 20లక్షలు, మాగంటి రాజారామ్మోహనరావు రూ. 25వేలు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కె.హిమబిందు రూ. 50వేలు కలిపి మొత్తం రూ. 4కోట్ల 25లక్షల 75వేలు భారీ విరాళాన్ని అందజేసినట్టు సీఆర్‌ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు బుధవారం ఏలూరుకు విచ్చేసిన సీఎం చంద్రబాబుకు సీఆర్‌ఆర్ విద్యాసంస్థల సొసైటీ మేనేజ్‌మెంట్, సిబ్బంది ఒకరోజు వేతనం రూ. 20లక్షల చెక్కును పాలకవర్గ అధ్యక్షుడు ఇంద్రకుమార్ అందజేసిన విషయం విదితమే.

ఏలూరు టూటౌన్: విజయవాడ వరద బాధితులకు ఎంతో మంది సాయం చేయడానికి ముందుకు రావడం హర్షణీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో వ్యాపారవేత్త కొట్టు మధు లక్షా11,116 చెక్కును అందజేశారు. ఆకుకూరల వర్తక సంఘం వ్యాపారులు రూ.2,22,348 చెక్కును ఎమ్మెల్యే చంటికి అందజేశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త కొట్టు మనోజ్, కొట్టు అప్పారావు, రాజు, శ్రీను, కిషోర్, మోహన్, రమణ, పాల్గొన్నారు.

ఉంగుటూరు: వరద బాధితుల కోసం ఉప్పాకపాడు ఫౌండేషన్ స్కూలు విద్యార్థులు రూ.15వేలను సేకరించి తమ గురువులకు అందించారు. ఉపాధ్యాయులు పి.శ్రీదేవి,అల్లు శ్రీను, హెచ్‌ఎం నక్కా సుధాకర్‌లకు అందించారు.

పెదవేగి: కొండలరావుపాలేనికి చెందిన ప్రవాసాంధ్రుడు మేకా వినయ్‌బాబు వరద బాధితుల సహాయార్థం రూ.10లక్షల చెక్కును రాష్ట్రమంత్రి నారా లోకేశ్‌కు అందించారు.

కమ్యూనిస్టు యోధుడిని కోల్పోయాం

సీతారామ్ ఏచూరి మృతికి కమ్యూనిస్టు నాయకుల నివాళి

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 12 :సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారామ్ ఏచూరి లాంటి కమ్యూనిస్టు యోధుడ్ని కోల్పోవడం బాధాకరమని పలువురు కమ్యూనిస్టు నాయకులు అన్నారు. సీతారాం ఏచూరి మృతికి సీపీఎం కార్యాలయంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సభలో డి.ఎన్.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి కాకినాడ వాసి అన్నారు. విద్యార్థి దశ నుంచి వామపక్ష రాజకీయాలకు ఆయన ఆకర్షితులై సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా మూడు పర్యాయాల నుంచి పనిచేస్తున్నారన్నారు. ఆయన ధనిక కుటుంబంలో జన్మించినప్పటికి పేదల సమస్యలంటే ఎనలేని అభిమానమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుడిపాటి నరసింహారావు, ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల గురువారం స్థానిక అగ్రహారంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు సంతాప సభ నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు.
- సీతారాం ఏచూరి మృతి పట్ల సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సీపీఐ రాష్ట్రకంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావులు గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

కామవరపుకోట: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు సీతారామ్ ఏచూరి మృతిపట్ల సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు, ఏఐటీయూసీ నాయకులు కంకిపాటి బుచ్చిబాబు, ముఠా వర్కర్స్ నాయకులు దుర్గారావు, సత్యనారాయణ, రమణ బృందం ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తొలుత సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

నిడమర్రు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పట్ల మండలంలో కమ్యూనిస్టు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. భువనపల్లి సెంటర్‌లో కమ్యూనిస్టు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కుక్కునూరు: విద్యార్థి దశ నుంచి అంచలంచెలుగా సీపీఎం జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదిగిన ఏచూరి సీతారామ్ మృతి పార్టీకి తీరని లోటని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఏచూరి అకాల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా కృషి చేయడమే నిజమైన నివాళి అన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 12: బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్కల అధ్యాపక గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంజీవని కుసుమ తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఈ నెల 14వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలని 25న ఉదయం ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

పెదపాడు, సెప్టెంబరు 12 : వరదల కారణంగా ముంపునకు గురైన గోగుంటలోని 105 కుటుంబాలకు సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల, సెయింట్ థెరిస్సా మహిళా విద్యార్థినులు బియ్యం, పప్పు, నూనె, బట్టలు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వికార్ జనరల్ ఫాదర్ బాల, సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజ్ కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, సోషల్ సర్వీస్ డైరెక్టర్ ఫాదర్ టి.ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు, సెప్టెంబరు 12 :విద్యుత్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ యడ్ల రాంబాబు తెలిపారు. పెదపాడు, గుడిపాడు, సకలకొత్తపల్లి, వడ్డిగూడెం, కొణికి, గోగుంట, నాయుడుగూడెం, వసంతవాడ, తోటగూడెం, పునుకొల్లు, కలపర్రు, వట్లూరు ఏరియాలో రాఘవ ఎస్టేట్, ఇంద్రప్రస్థ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

కాజ్‌వే నిర్మాణానికి అనుమతిపై హర్షం

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 12: శనివారపుపేట కాజ్‌వే నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.15కోట్లు కేటాయించటం పట్ల ఎమ్మెల్యే బడేటి చంటి హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా నగర ప్రజలు ఎమ్మెల్యే చంటిని బడేటి క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జనసేన చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి లోవరాజు, కార్యదర్శి తేజస్వి, కే.మహేష్, కే.వాణిశ్రీ, నాగమణి, సాయి తదితరులు ఉన్నారు.

విద్యార్థికి డీఈవో అభినందన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 12 : ట్రిపుల్ ఐటీలో స్పోర్ట్స్ కోటా విభాగం నుంచి సీటు సాధించిన స్థానిక న్యూ జనరేషన్స్ హైస్కూలు విద్యార్థి ఏ.వివేక్‌రాజ్‌ను డీఈవో అబ్రహం గురువారం అభినందించారు. జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా ఎన్నో పతకాలు సాధించడమేగాక, పదోతరగతిలో ఈ విద్యార్థి 518 మార్కులతో టాపర్‌గా నిలిచాడని స్కూలు డైరెక్టర్ ఎస్.ఆర్.కే.ఏ.ప్రసాద్ వివరించారు

గణేష్ ఉత్సవాల్లో అన్న సమారాధన

కామవరపుకోట, సెప్టెంబరు 12 : తడికలపూడిలోని సంత మార్కెట్ వద్ద జరుగుతున్న గణేష్ ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఉత్సవ నిర్వాహకులు ఈ సందర్భంగా భక్తులకు మహా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణను ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు.

నేడు రైతు సంఘం జిల్లా సమావేశం

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 12 : స్థానిక పవరుపేటలోని అన్నేభవనం వద్ద శుక్రవారం ఉదయం ఏపీ రైతు సంఘం జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. అన్ని మండలాల రైతు సంఘం కార్యకర్తలు పాల్గొంటారన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. భారీ వర్షాలు, వరదల వలన జరిగిన పంట నష్టాలను, అన్ని పంటల రైతు సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు.

వరద బాధితులకు కొండంత అండ


సమస్యలు వింటున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, సెప్టెంబరు 12: వరద తాకిడితో పంటలు, పశువులు, నివాసాలను కోల్పోయిన బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాకతో కొండంత అండ లభించిందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలో గురువారం వివిధ గ్రామాలనుంచి వచ్చిన ప్రజల సమస్యలు విన్న ఆయన వాటి పరిష్కారానికి అనువుగా చర్యలు తీసుకున్నారు. పలువురు దాతలు వరద బాధితులకు విరాళాలు అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు వరదలు పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లోని అనేక గ్రామాలను ముంచేశాయన్నారు. పదిరోజులపాటు తెరిపీయని వరద ఎంతోమంది జీవితాలను అతలాకుతలం చేసిందన్నారు. పెదపాడు మండలంలో లోయర్ డ్రెయిన్ల మరమ్మతులతోపాటు ఉప్పుటేరువద్ద రెగ్యులేటర్ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీతో వరద బాధితులకు కొండంత భరోసా లభించిందని ఆయన పేర్కొన్నారు.




పోలవరం.. దొరసానిపాడులలో నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు.. నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీలో వినాయకుడికి పూజలు

ఘనంగా గణేశ్ నిమజ్జనాలు

దెందులూరు, సెప్టెంబరు 12: వెలమపేట 9వ వార్డులో వినాయకుడి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి బ్యాండు సన్నాయి మేళాలు, చిత్రవిచిత్ర వేషాధారణలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పోలవరం: పోలవరం మండలంలో గణపతి విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం నిర్వహించారు. పాత పోలవరం, కొండ్రుకోట పునరావాస కాలనీ తదితర ప్రాంతాల్లో విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు.

ద్వారకాతిరుమల: దొరసానిపాడులో గురువారం సాయంత్రం వినాయక నిమజ్జనాలు జరిగాయి. విచిత్ర వేషధారణలు, తీన్‌మార్ వాయిద్యాలు, యువకుల నృత్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. మందిరంలోని వినాయకునికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై విగ్రహాన్ని ఉంచి వైభవోపేతంగా ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం వినాయకు డికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫ్యాక్టరీ సిబ్బందికి పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. జనరల్ మేనేజర్ మండవ అంజయ్య, ప్లాంట్ సీనియర్ మేనేజర్ పి.శ్రీనివాస్, పి.ఆనందరావు, వి.రంగారావు, ఎం.కిరణ్, పిఆర్‌ఓ ఏవీ రాఘవరావు పాల్గొన్నారు.

వేలేరుపాడు: మండలంలోని మల్లారం ఎస్సీకాలనీ, శివకాశీపురం, యర్రబోరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల నుంచి గణనాథులను ఊరేగింపుగా తీసుకొచ్చి గోదావరి వరదలో నిమజ్జనం చేశారు.

చింతలపూడి: వడ్డెరగూడెం, చిల్లపల్లి కాంప్లెక్స్, వైఎస్సార్‌కాలనీ, బట్టువారిగూడెం పలు ఏరియాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలను ముందుగా పూజలు జరిపి పట్టణాల్లోని ప్రధానవీధుల్లో ఊరేగించారు. తీన్మార్‌డప్పులు, బాణసంచా కాల్పులు, డీజే సౌండ్స్, డ్యాన్సులతో అలరిస్తూ సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌లో నిమజ్జనం జరిపారు.

17 నుంచి స్వచ్ఛతా హీ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 12: స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఏలూరు జిల్లాగా రూపొందించటానికి అధికారులంతా కంకణబద్ధులు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో స్వచ్ఛ భారత్ దివస్ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై ఏపీ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ రాష్ట్ర రాజధాని నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. సెప్టెంబరు 17వ తేదీ నుంచి నిర్వహించే 2024 లో స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత అను నినాదంతో ఈ స్వచ్ఛతా హీ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో కలెక్టరేట్‌తో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోను, పోలీస్ స్టేషన్లలోను, పాఠశాలల్లోను, కళాశాలలు, హాస్టల్స్‌లోను అధికారులు, సిబ్బంది శ్రమదానం చేసి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమ షెడ్యూల్‌ను రూపొందించి శుక్రవారం నాటికి నివేదిక సమర్పించాలన్నారు. ఈ స్వచ్ఛతా హీ కార్యక్రమంలో యువతను, కళాకారులను ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, నగర పాలక సంస్థ కమిషనర్ భాను ప్రతాప్, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, డీఎంహెచ్‌వో ఎస్.శర్మిష్ఠ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సత్యనారాయణ, డీఈవో అబ్రహం, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్, ఐసీడీఎస్ పీడీ కె పద్మావతి, సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్ , మెప్మా పీడీ ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన



ఉంగుటూరు, సెప్టెంబరు 12: ప్రకృతి వ్యవసాయంలో మెళకువల నిమిత్తం ఏలూరులో శిక్షణ నిమిత్తం వచ్చిన విద్యార్థుల బృందం గురువారం నాడు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా వెల్లమిల్లి, నాచుగుంటలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ నిపుణలు గద్దే రత్నాజి, పరిమి రాజేంద్ర ప్రసాద్‌ల క్షేత్రాలను సందర్శించి పొలాలలో ఎదుగుతున్న పంటలను, అంతర్ పంటల వివరాలడిగి తెలుసుకున్నారు.

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన


తిరుమలాపురంలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

వేలేరుపాడు, సెప్టెంబరు 12: వేలేరుపాడు మండలంలోని పలు వరద ప్రభావిత గ్రామాల్లో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జంగారెడ్డి గూడెం ఆర్డీవో అద్దయ్య, డ్వామా పీడీ ఏ.రాము ఇతర అధికారులు పర్యటించారు. మండలంలోని తిరుమలాపురం గ్రామానికి బోటుపై ప్రయాణించి గ్రామానికి చేరుకుని గ్రామస్థుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో 25కిలోల బియ్యం, కిలో కందిపప్పు, పంచదార, పామాయిల్, కూరగాయాలను పంపిణీ చేశారు. అలాగే రేపాకగొమ్ము, రుద్రమ్మకోట గ్రామాల్లో కూడా పర్యటించి ఆ గ్రామాల్లో కూడా నిత్యావసరాలను పంపిణీ చేశారు.

జీవో 85 రద్దుచేయాలి



ఏలూరు రూరల్, సెప్టెంబరు 12:గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 85 రద్దుచేయాలని ప్రాథమిక హెల్త్ సెంటర్లో పనిచేస్తున్న వైద్యులు గురువారం ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులకు వినతిపత్రం ఇచ్చి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనే జీవో85 ఇచ్చిందన్నారు. ఈ జీవో కారణంగా స్పెషలిస్ట్ వైద్యులుగా అయ్యే అవకాశం పీహెచ్‌సీ వైద్యులు కోల్పోతారన్నారు. సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం కోల్పోయే ప్రమాదం ఉందని, జీవో రద్దుచేసి ప్రభుత్వం ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే వాసుబాబుకు పరామర్శ


మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును పరామర్శించిన ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల

నిడమర్రు సెప్టెంబరు 12: ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును పలువురు పరామర్శించారు. వాసుబాబు మేనమామ, భువనపల్లి గ్రామ సర్పంచ్ సంకు పుల్లారావు ఇటీవలే మృతి చెందారు. గురువారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జనసేన నాయకులు వాసుబాబును పరామర్శించారు. సర్పంచ్ పుల్లారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పరామర్శించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


ఏలూరులో మాట్లాడుతున్న సీడీపీవో పద్మావతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 12 : గర్భిణులు సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనతకు గురవుతారని ఏలూరు ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఏలూరు 35వ డివిజన్ గానుగుల పేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సును నిర్వహించారు. సీడీపీవో కె పద్మావతి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని దీని వలన గర్భంలో ఉన్న బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుదల ఉంటుందని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఎస్‌ఆర్‌సి డాక్టర్ పావని మాట్లాడారు.

కొయ్యలగూడెం: తల్లులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యకరమైన బిడ్డలు పుడతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నమోమిరాణి అన్నారు. ఈ మేరకు గురువారం మంగపేట గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: అంగన్‌వాడీ సేవలను గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాలలోపు పిల్లలు తప్పక ఉపయోగించుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు సూచించారు. గురువారం శ్రీనివాసపురం గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో పి. బ్యూలా

బుట్టాయగూడెం: పోషణ మా కార్యక్రమంలో భాగంగా గురువారం బుట్టాయగూడెంలో పోషకాహార ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సూపర్‌వైజర్ కె.రూపాస్సీ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, తల్లులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం తయారు చేసుకోవడంపై అవగాహన కల్పించామన్నారు. అంగనవాడీ కేంద్రాల ద్వారా అందించే న్యూట్రిషన్ కిట్స్, గుడ్లు, పాలు, బాలామృతం, బియ్యం, పప్పు, ఆయిల్ పదార్థాలతో రకరకాల వంటకాలు తయారు చేసే పద్ధతులను వివరించినట్లు తెలిపారు.

గాంధీ తత్వంపై చిత్రలేఖనం పోటీ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 12 : మహాత్మాగాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు 'గాంధీతత్వం-నేటిభారతం' అనే అంశంపై జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉమ్మడిజిల్లా సర్వోదయమండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలిపారు. చిత్రాన్ని ఏ-4 సైజు డ్రాయింగ్ షీటుపై వేసి, స్కాన్‌తీసి ఐఎస్‌పి ఎడ్యుకేషన్ జీమెయిల్ చిరునామాకు మెయిల్‌ద్వారా ఈ నెల 21లోగా పంపాలని సూచించారు. ఉత్తమచిత్రాలను పంపిన విజేతలకు అక్టోబరు 2న బహుమతులు అందజేస్తామని, వివరాలకు 99490 93115 నెంబరులో సంప్రదించాలని కోరారు.

మండలస్థాయి స్కూల్‌గేమ్స్ ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రంగయ్య

ఏలూరు రూరల్, సెప్టెంబరు 12: మండలస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు గురువారం శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. పోటీలను ఎంఈవో రంగయ్య ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. పలుపోటీల్లో గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు.

వినాయకుడికి ఎంపీ పూజలు


లక్ష్మీగణపతి స్వామి సేవలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 12 : నగరంలో జరుగుతున్న గణేష్ ఉత్సవాల్లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఉత్సవ గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్రంపాడులోని శ్రీలక్ష్మీగణపతి స్వామి ఆలయంలో అర్చనలు జరిపారు. కూరగాయల మార్కెట్ వద్ద వినాయకుడిని ఎంపీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గర్భిణులకు సీమంతాలు



పోలవరం, సెప్టెంబరు 12: పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా పోలవరం పంచాయతీ బీసీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సీమంతం, శిశువులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి సీడీపీవో రాణి, అంగన్వాడీ కార్యకర్తలు సుంకర అమ్మాజీ, గుత్తుల విజయలక్ష్మి, కొండకుమారి పాల్గొన్నారు.

కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయాలని ధర్నా



పోలవరం సెప్టెంబరు 12: కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని గురువారం పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్సులు శిరీష మాలతి, తులసి, రమాదేవి, శాంతి, సత్యశ్రీ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల అనుభవంతో సర్వీసుతో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న ఏఎన్‌ఎంలకు ఎలాంటి ప్రమోషన్లు ఇవ్వకుండా ప్రభుత్వం జీవో నెం 115 ద్వారా ఇటీవల వచ్చిన ఏఎన్‌ఎంలకు జీఎన్‌ఎం శిక్షణ ఇచ్చి ప్రమోషన్లు ఇస్తున్నారని తమను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కూడా శిక్షణ ఇచ్చి ప్రమోషన్లు కల్పించాలని, రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగ భద్రత, రెగ్యులర్ చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్‌లు రాజు , సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

పెదవేగి, సెప్టెంబరు 12: కోకో లైఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా ఏఎఫ్‌పీఆర్వో సంస్థ మహిళలు, విద్యార్థులకు బుర్రకథ ద్వారా వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ ఊరూరా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పెదవేగిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బాలల హక్కులు, మ్యాజిక్ షో, సైబర్ క్రైం, గుడ్ టచ్- బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

భోజనం నాణ్యత పరిశీలించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

భీమడోలు, సెప్టెంబర్ 12 : ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కోడిగుడ్లు, భోజనం నాణ్యతను పరిశీలించిన తరువాతే విద్యార్థులకు అందజేయాలని ఎంఈవో భాస్కర్ సూచించారు. భీమడోలు మండల విద్యాశాఖా కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎంఈవో 2 భాస్కర్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో సమగ్ర సమాచారాన్ని పొందుపర్చి అధికారులకు పరిశీలించేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. పాడైన గుడ్లను వంటకు ఉపయోగించరాదని ప్రతి రోజు పాఠశాల పరిసర ప్రాంతాల్లోని శానిటేషన్‌కు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయించాలని, ఇటీవల పూర్తి అయిన పరీక్షల వేల్యూయేషన్ పూర్తి చేసుకుని ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు సిద్ధంగా ఉంచాలని సూచించారు.

కేంద్ర మంత్రి దృష్టికి నిర్వాసితుల సమస్యలు

కుక్కునూరు, సెప్టెంబర్లు 12: కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను కుక్కునూరు మండల బీజేపీ సీనియర్ నాయకులు చెకూరి రమణరాజు గురువారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. పోలవరం నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ సమస్యలను ఆయనకు వివరించారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కేంద్ర రాష్ట్రాలతో మాట్లాడి నిర్వాసితులందరికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కుక్కునూరు మండల సమస్యలను కేంద్ర మంత్రికి వివరించారు.

వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి

కుక్కునూరు, సెప్టెంబర్లు 12: కుక్కునూరు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి వ్యవసాయ కార్మికులకు జీవనభృతి కల్పించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొరాకుల బాబురావు డిమాండ్ చేశారు. భారీ వర్షాలు, వరదల కారణంగా మండలంలో వ్యవసాయ కూలీలకు పనులులేక కుటుంబాలు పూటగడవని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల కుటుంబాలకు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.



జనసేనలో చేరిక

ఏలూరు రూరల్, సెప్టెంబరు 12:స్థానిక రెండో డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన 30మంది వైసీపీ కార్యకర్తలు ఆ డివిజన్ ఇన్‌ఛార్జ్ ఆర్.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం జనసేనపార్టీ కార్యాలయంలో జనసేనలో చేరారు. పార్టీ ఇన్‌చార్జ్ రెడ్డిఅప్పలనాయుడు పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న చంద్రశేకర్‌రెడ్డి

నూజివీడు, సెప్టెంబరు 12: ఆఫ్రికాలో గల ట్యునీషియాలోని ట్యూనిస్ సైన్స్ సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ సాంకేతిక పోటీల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థి కోట్ల నాగేశ్వరరావు అంతర్జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచినట్లు డైరెక్టర్ బి.చంద్రశేకర్ రెడ్డి తెలిపారు. అగ్రి అలయన్స్ అనే ఒక వినూత్నమైన స్మార్ట్ వ్యవస్థతో ఒకే పరికరంతో బహుళ అంశాలను ఏకీకృతం చేసి పంటకు కావాల్సిన నీటి పారుదల, చీడపీడల అంచనా, ఎరువులు తదితరాలు అన్నింటిని నిర్వహణ చేసే విధానాన్ని రూపొందించిన ఈసీఈ ఫైనలియర్ విద్యార్థి నాగేశ్వరరావు అంతర్జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచారన్నారు. ఈ నెల 7,8 తేదీల్లో ట్యూనిస్ సైన్స్ యూనివర్శిటీలో హైబ్రీడ్ విధానంలో ఈ పోటీలు నిర్వహించగా, తమ విద్యార్థి ఆన్‌లైన్‌లో ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తొమ్మిది దేశాల నుంచి 95 యూనివర్శిటీలకు సంబంధించిన 260 జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా, ఫైనల్స్‌కు 32 జట్లు చేరాయని, నాగేశ్వరరావు రెండో స్థానంలో నిలిచాడన్నారు విద్యార్థినిని ఆయన, ఏవో బి.లక్ష్మణరావు, ఇతర సిబ్బంది అభినందించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


మమధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎస్ఎంసీ చైర్మన్, వెల్ఫేర్ అసిస్టెంట్

ముదినేపల్లి, సెప్టెంబరు 12 : పాఠశాలల ఎస్ఎంసీ కమిటీల చైర్మన్లు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును గురువారం పరిశీలించారు. ముదినేపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల చైర్మన్లు మోనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతుందా, నాణ్యత పాటిస్తున్నారా లేదా అన్న అంశాలను పరిశీలించి భోజనాన్ని రుచి చూశారు. పెయ్యేరు ఎలిమెంటరీ పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ మున్నీసా, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు భోజనాన్ని పరిశీలించారు. పెదగొన్నూరు, బొమ్మినంపాడు, ముదినేపల్లి తదిత ర పాఠశాలల్లో కూడ మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు.

పారిశుధ్య కార్యక్రమం



చాట్రాయి, సెప్టెంబరు 12: మండలంలోని సోమవరంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. వీధులు, డ్రెయిన్లు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. సర్పంచ్ శోభనబాబు, ఈవోపీఆర్డీ నాగరాజు, వైద్య సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారం మాత్రమే తినాలని, దోమతెరలు వాడాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే వెంటనే పీహెచ్‌సీకి వెళ్ళి చికిత్స పొందాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఏచూరికి ఘన నివాళి


ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సీతారం కి నూజివీడు సీపీఎం కమిటీ ఘన నివాళులర్పించారు. చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, పట్టణ కార్యదర్శులు ఎస్.ఆర్ హనుమాన్‌లు, శోభనాద్రి, పద్మాంజలి, సరస్వతి కమ్యూనిస్టు ఉద్యమాల్లో ఏచూరి పాత్రను గుర్తు చేసుకున్నారు.

పెండింగ్ జీతాలు తక్షణం విడుదల చేయాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 12: పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు తక్ష ణం విడుదల చేయాలని సీఐటీ యూ నూజివీడు ప్రధాన కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులతో గురువారం ఆయన మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

అవకతవకలు వెల్లడించకుంటే రాజీనామా


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కైకలూరు వార్డు సభ్యులు

కైకలూరు, సెప్టెంబరు 12: కైకలూరు పంచాయతీలో జరుగుతున్న అవకతవకలపై అధికారులు పూర్తి విచారణ చేసి వాటిని ప్రజలకు వెల్లడించాలని లేకుంటే మూకమ్మడిగా రాజీనామా చేస్తామని 15వ వార్డు సభ్యుడు కేవీఎస్ఎం నాయుడు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. పంచాయతీలో రూ.1.84 కోట్లు అవినీతి జరిగినట్లు చేసిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు జంగారెడ్డిగూడెం, ఏలూరు డీఎల్పీవోలతో రెండుసార్లు విచారణ చేశారన్నారు. విచారణ అధికారులు కలెక్టర్‌కు నివేధికలు అందించామని చెబుతున్నప్పటికీ ఫిర్యాదుదారులైన తమకు ఏ విషయాన్ని వెల్లడించడం లేదని పేర్కొన్నారు. విచారణ చేసి నెల రోజులు గడుస్తున్నప్పటికీ విచారణలోని అంశాలను వెల్లడించకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని వారం రోజుల్లోగా విచారణ అంశాలను వెల్లడించాలని లేకుంటే 13 మంది వార్డు సభ్యులు రాజీనామా చేస్తామన్నారు.


ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద కమిటీ సభ్యులు


మండవల్లిలో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలి వెళ్తున్న విఘ్నేశ్వరుడు


కలిదిండి మండలం గుర్వాయిపాలెంలో వినాయకుడి ఊరేగింపు

గణనాథునికి వీడ్కోలు

» కోలాహలంగా గణేష్ నిమజ్జనాలు » మేళతాళాలతో భారీ ఊరేగింపులు


కైకలూరు వెలమపేటలో వినాయకుని ఊరేగిస్తున్న దృశ్యం

ముదినేపల్లి, సెప్టెంబరు 12 : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గణేష్ నిమజ్జనోత్సవాలు కోలాహలంగా జరిగాయి. శ్రీహరిపురంలోని శ్రీ దాసాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన వినాయక నవరాత్రుల ఉత్స వాలు ముగిశాయి. ఈ సందర్భంగా నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ కమిటీ కో కన్వీనర్ కొడాలి వినోద్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కాకరవాడలో గణేష్ నిమజ్జనం వైభవంగా జరిగింది. పెదపాలపర్రులో అంబేద్కర్ యువసేన నాయకులు దాకారపు విజయ్ కుమార్, రక్షణ, మొవ్వా ఆంజనేయులు ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనోత్సవం జరిగింది.

● మండవల్లి, సెప్టెంబరు 12: మండలంలోని విఘ్నేశ్వరుడి విగ్రహాలను భారీ ఊరేగింపుల మధ్య నిమజ్జనం చేశారు. మండవల్లి ప్రధాన సెంటర్లో ఏర్పాటు చేసిన వివిధ అలంకరణలో పూజలు నిర్వహించిన వినాయకుడి విగ్రహాలను మేళతాళాలతో భారీ ఊరేగింపులతో నిమజ్జనం చేశారు.

● కలిదిండి : గుర్వాయిపాలెం, కోట కలిదిండి, ఇందిరా కాలనీ, మట్టగుంట గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు నిర్వహించారు. వినాయకుడిని పురవీధుల్లో డప్పు వాయిద్యాలతో మేళతాళాలతో బాణసంచా కాల్చుతూ ఊరేగించారు.

● నూజివీడు టౌన్ : పట్టణంలోని కుందనపువారి వీధిలో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గణపతి చలువతో ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆయన ఆకాక్షించారు.

● ముసునూరు : చవితి ఉత్సవాలు ఆరో రోజు పడమట రామాలయంలో కొలువుతీరిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి లడ్డు ప్రసాదానికి వేలం నిర్వహించారు. 30 కేజీల లడ్డులను పాకనాటి రాంబాబు, కోండిబోయిన పంగిడియ్య, తలకొండ రామకృష్ణ, మానికల నాగేంద్రరావు, గూంట్రు చంటి రూ.70 వేలకు దక్కించుకున్నారు. అనంతరం తీన్‌మార్, డీజేలతో యువత నృత్యాల మధ్య స్వామివారి ఊరేగింపు నిర్వహించి, స్థానిక నగలరా చెరువులో నిమజ్జనం చేశారు. శ్రీవరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మానికల సాయి, పేరం వెంకీ, ఎం.గంగధరరావు, ఎస్.శ్రీనివాసరావు, పి.కాసులు, పి.సాంబశివరావు తదితరులు భక్తులకు ప్రసాదాలను అందజేశారు. అలాగే తూర్పువీధిలో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గణేషుడికి గ్రామోత్సవం నిర్వహించి, ధర్మవరం చెరువులో నిమర్జనం చేశారు.

● కైకలూరు : వెలమపేటలో కొలువైన వినాయకుడిని ఊరేగించారు. ఆటపాక రెడ్డినగర్‌లో వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్న సమారాధనను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. కైకలూరులో కూరగాయలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదివినాయక స్వామిని ఎమ్మెల్యే శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కేవీఎస్ఎం నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మీ, కూటమి నాయకులు పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కలిదిండిలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న తాపేశ్వరం లడ్డూలు

104 కిలోల లడ్డూ సమర్పణ

కలిదిండి, సెప్టెంబరు 12 : కలిదిండి సెంటర్‌లో ఏర్పాటు చేసిన 12 అడుగుల వినాయకుడికి వ్యాపారి బత్తుల హనుమంతరావు కుమారుడు మణికంఠ గుప్తా 50 కిలోల తాపేశ్వరం లడ్డూ, గొల్లగూడెంకి చెందిన మరీదు స్వామి 54 లడ్డూలను గురువారం సమర్పించారు. తొలుత లడ్డూలను వ్యాన్‌పై ఊరేగింపుగా వినాయకుడి మండపానికి తీసుకెళ్లారు. ఆర్య వైశ్య సంఘ నాయకులు వూర శ్రీధర్, నీలి సుమన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే


కైకలూరులో ముంపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్


జంగంపాడు పల్లిపాలెంలో నీట మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

కైకలూరు, మండవల్లి, సెప్టెంబర్ 12: పట్టణంలోని ముంపు ప్రాంతాలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. బ్రహ్మంగారి గుడి వీధిలోని ముంపు నీటిని ఫైర్ ఆఫీస్ వద్ద మోటార్లను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపాదికన తొడించాలని ఆదేశించడంతో అధికారులు మోటార్లు పెట్టి ముంపు నీటిని తొలగిస్తున్నారు. కొట్టాడ, పల్లిపాలెం, జంగంపాడు గ్రామాల్లో తహసీల్దార్ ఉదయబాస్కరరావు, రాష్ట్ర వడ్డీ సాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు ముంపును పరిశీలించారు. పల్లిపాలెం, జంగంపాడు గ్రామాల్లో ఉప్పుటేరు పొంగి వరద నీరు ఇళ్లలోకి చేరింది. అంతా నిరుపేదలు కావడంతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కొల్లేరు వరద ఉధృతి తగ్గాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వరద బాధితులకు సాయం


నూజివీడు సుంకొల్లు నుంచి తరలిస్తున్న వస్తు సామగ్రి

కైకలూరు, సెప్టెంబరు 12: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి గురువారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన వారు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు ఇంత పెద్దఎత్తున విరాళాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. శుక్రవారం కూడా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు.

● నూజివీడు : విజయవాడ వరద బాధితుల‌కు మండలంలోని వివిధ గ్రామాల వాసులు తమకు తోచిన విధంగా సాయం చేస్తున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి పిలుపుమేరకు నూజివీడు మండలం సుంకొల్లు టీడీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలు బియ్యం, దుప్పట్లు సేకరించి విజయవాడకు తరలించారు. నియోజకవర్గ టీడీపీ నాయకుడు తక్కి వేణుగోపాలరావు, బీజేపీ మండల అధ్యక్షులు గోగినేని శ్రీనివాసకుమార్ అప్పారావు తదితరులు వస్తు సామగ్రిని విజయవాడకు పంపించారు. దాదాపు వెయ్యి మందికి ఒక్కొక్కరికి ఐదు కేజీల బియ్యం, దుప్పట్లు ఇతర వస్త్రాలను అందజేశారు. టీడీపీ, బీజేపీ నాయకులు దొప్పలపూడి సాంబశివరావు, నెక్కళపు వరప్రసాదరావు, కొనకళ్ళ కోటేశ్వరరావు,కృష్ణారావు, చంద్రశేఖర్, యంత్రపాటి వేణు పాల్గొన్నారు.

ప్రేమ జంటకు కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, సెప్టెంబరు 12: పట్టణ పోలీసులు ఓ ప్రేమ జంటకు గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నూజివీడుకు చెందిన కొడవటి అజయ్, ఏలూరుకు చెందిన కొత్తపల్లి శ్రావణి నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈక్రమంలో తమ ప్రేమ విషయాన్ని ఇరువురి పెద్దలకు చెప్పగా వారు నిరాకరించడంతో గురువారం నూజివీడు శిలువ గట్టు వద్ద వారు వివాహం చేసుకున్నారు. అయితే కొత్తపల్లి శ్రావణి ఫిర్యాదు మేరకు ప్రేమ జంటను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని ఇరువురు మేజర్లు అవ్వడంతో వారి ఇష్ట ప్రకారం నడుచుకునేందుకు చట్టపరంగా వారికి అవకాశం ఉందని సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

పాస్టర్ల సంఘం వితరణ


పుట్టగుంటలో వరద బాధితులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందిస్తున్న ముదినేపల్లి పాస్టర్ల సంఘ నాయకులు

ముదినేపల్లి, సెప్టెంబరు 12 : కృష్ణా జిల్లా నందివాడ మండలం పుట్టగుంట గ్రామంలో నేటికీ బుడమేరు వరద నుంచి తేరుకోక తీవ్ర ఇబ్బంది పడుతున్న బాధితులకు ముదినేపల్లి మండలం పాస్టర్ల సంఘం ఆపన్నహస్తం అందించింది. సంఘ నాయకులు గురువారం యు.సర్జన్ బాబు, పి.పేతురు, ప్రసన్న రాజు, విజయ కుమార్ తదితరులు ముదినేపల్లి వరద నీటిలోనే నడుచుకుంటూ పుట్టగుంట వెళ్లి వరద బాధితులకు దుప్పట్లతోపాటు రొట్టెలు, ఇతర నిత్యావసర సరుకులను అందజేశారు. రవాణా సదుపాయం లేక బుడమేరు పాయలో పడవలపై రోడ్డు మునిగిపోవటంతో ట్రాక్టర్‌పై వెళ్లి బాధితులను పరామర్శించి సహాయం అందజేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కైకలూరు, సెప్టెంబర్ 12: గ్రామంలోని భవానమ్మ చెరువు సమీపంలో నివశిస్తున్న వ్యక్తి అదృశ్యంపై కైకలూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం భవనామ్మ చెరువు సమీపంలో నివశిస్తున్న షేక్ రహంతుల్లా(65) తన భార్యతో కలిసి దర్జీదారునిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. ఈ నెల 9వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి మరలా తిరిగి రాకపోవడంతో కైకలూరు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్ళ వద్ద గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీనితో అతని భార్య షేక్ షంషద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్సై మల్లిఖార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైస్కూల్ హెచ్ఎంపై కేసు నమోదు

ముదినేపల్లి, సెప్టెంబరు 12 : పెదపాలపర్రు జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్ఎంగా పని చేస్తూ సస్పెండ్ అయి ప్రస్తుతం మండవల్లి మండలం ఇంగిలి పాకలంక హైస్కూల్ హెచ్ఎంగా పని చేస్తున్న శాంతకుమారిపై గురువారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం బుధవారం పెదపాలపర్రు హైస్కూల్‌లో ఎల్‌పీసీ తీసుకునేందుకు వచ్చిన సందర్భంగా ఆమెకు ఇన్‌చార్జి హెచ్ఎం పాండురంగారావుకు మధ్య స్కూలుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల బిల్లుల అప్పగింతపై గొడవ జరిగింది. నాడు-నేడు పనులకు సంబంధించిన ఖర్చుల వివరాలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సంబంధించిన లెక్కలు, ఇతర రికార్డులను తనకు పూర్తిస్థాయిలో అప్పగిస్తేనే తాను ఎల్‌పీసీ ఇస్తానని ఇన్‌చార్జ్ హెచ్ఎం స్పష్టం చేయడంతో గొడవ ఘర్షణకు దారి తీసింది. ఆ సమయంలో శాంతకుమారికి తాను చూపించిన కొన్ని బిల్లులను చించి వేయడమేగాక, ఇతర రికార్డులను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, కొంతమంది టీచర్లు ఆమెను ఆపారని ఇన్‌చార్జి హెచ్ఎం పాండురంగారావు గురువారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై శాంతకుమారితోపాటు ఆమెకు మద్దతుగా ఉన్న కుమార్తె సింధుపై కూడా కేసు నమోదు చేసి ఎస్ఐ డి.వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

కాలిన పాడి గేదెలు మృతి

ముదినేపల్లి, సెప్టెంబరు 12 : పెయ్యేరులో బుధవారం వేకువ జామున అగ్ని ప్రమాదానికి గురై తీవ్రంగా కాలిన పాడి గేదెలు గురువారం మృతి చెందాయి. ఆ గ్రామానికి చెందిన నిడుమోలు కోటేశ్వరరావుకు చెందిన పశువుల పెడ్డు అగ్నికి ఆహుతి కాగా, అందులోని నాలుగు గేదెలు తీవ్రంగా కాలిపోయాయి. పశు వైద్యులు చికిత్స చేసినా ఫలితం లేక సుమారు రూ.3.50 లక్షల విలువైన పాడి గేదెలు మృతి చెందాయి. దీంతో కోటేశ్వరరావు కుటుంబం ప్రధాన ఉపాధి దెబ్బతింది.

దోమల మందు పిచికారీ



కైకలూరు, సెప్టెంబరు 12: వాయుగుండం ప్రభావంతో గ్రామాల్లో రహదారులు ముంపునకు గురికావడంతో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో బ్లీచింగ్, సున్నం పిచికారీ చేస్తున్నారు. కైకలూరు మండలం భుజబలపట్నంలో గురువారం సర్పంచ్ గురజాల రామసీత, సెక్రటరీ రవికిరణ్ ఆధ్వర్యంలో సున్నం చల్లించారు. అలాగే ఆటపాకలో దోమల నివారణకై ఫాగింగ్ మందును పిచికారీ చేశారు. సర్పంచ్ తలారి జాన్‌మణి ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో దోమల మందు చల్లారు.

నేడు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు

ముసునూరు, సెప్టెంబరు 12: ముసునూరు జడ్పీ పాఠశాలలో శుక్ర, శనివారాలలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ సెలెక్షన్స్ కమ్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు హెచ్ఎం ఎ.సునీలరాణి తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు జరుగుతాయన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న వారు నిర్దేశిత ప్రొఫార్మాతో, పుట్టిన తేదీ వివరాలతో ఎంట్రీఫారమ్‌ను ప్రధానోపాధ్యాయుల సంతకంతో తీసుకురావడంతోపాటు మధ్యాహ్న భోజన ప్రొఫార్మాను కూడా జతపరచాలన్నారు. వివరాల కోసం మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఎండీ ఆలీఖాన్‌ను సెల్ నెంబరు 98488 55786లో సంప్రదించాలన్నారు.

గండి పూడ్చివేతకు చర్యలు

ముసునూరు, సెప్టెం బరు 12: మండలంలోని చెక్కపల్లి వద్ద సంధ్య వాగు ఉధృతికి వంతెన కూలి ప్రధాన రహదారికి పడిన గండిని పూడ్చే పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం చేపట్టారు. డీఈ బాబురావు, ఏఈ అశోక్ కుమార్ పర్యవేక్షణలో ప్రొక్లైనర్‌తో కూలిపోయిన వంతెన శిథిలాలను తొలిగించారు. అలాగే 20 సిమెంట్ తూరలు వేసేలా గండిని సిద్ధం చేశారు. డీఈ బాబురావు మాట్లాడుతూ భారీ వర్షాలకు సంధ్యవాగులో వరద ప్రవాహానికి వంతెన కూలిపోయి, రహదారికి పెద్ద గండిపడిందని, ఈ గండిపడి సుమారు రెండు వారాలు కావస్తుందన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు తాత్కాలికంగా గండిని సిమెంట్ తూరలతో పూడ్చేందుకు గత వారం రోజుల క్రితమే పైపులను సిద్ధం చేశామన్నారు. అయితే సంధ్య వాగులో వరద నీరు తగ్గకపోవడంతో ఈ ప్రక్రియ చేపట్టలేకపోయామన్నారు. ప్రస్తుతం వాగులో నీరు తగ్గడంతో పనులు చేపట్టామని, శుక్రవారం సిమెంట్ తూరలు వేసి, రాకపోకలు పునరుదరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ తెలిపారు.

ముంపులోనే గ్రామాలు

కొల్లేరు లంక గ్రామాలు ముంపు నీటిలోనే మగ్గుతున్నాయి. తొమ్మిది రోజులుగా కొల్లేరు గ్రామాల్లోకి నీరు వచ్చి ప్రజల రాకపోకల స్తంభించాయి. మండవల్లి మండలంలోని కైకలూరు-ఏలూరు రోడ్డులో పెద్ద,చిన్నఎడ్లగాడి వద్ద వరద ఉధృతి తగ్గలేదు.


ముంపునకు గురైన మండవల్లి మండలం చావలిపాడు కాలనీ


ముంపు నీటిలోనే మగ్గుతున్న పెనుమాకలంక గ్రామం


కొండంగి పల్లిపాలెం ఇళ్లలోకి చేరిన వరద నీరు

రక్తహీనత వల్లే అన్ని వ్యాధులు


చాట్రాయి మండలం చిత్తపూరులో గర్భిణులకు సీమంతం


నూజివీడు పట్టణం బాపునగర్‌లో అన్నప్రాసన చేస్తున్న సీడీపీవో

ముదినేపల్లి, సెప్టెంబరు 12 : పోషకాహార మాసోత్సవాల సందర్భంగా చేవూరుపాలెం గ్రామంలో గురువారం మహిళలకు ఐసీడీఎస్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.ప్రసూన అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో గురజ పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ జోనాతన్ మాట్లాడుతూ మహిళలు రక్తహీనతను తగ్గించేందుకు పోషకాహారాన్ని తీసుకో వాల్సిన అవసరం ఉందన్నారు. రక్తహీనత వల్లే అన్ని వ్యాధులు సంక్రమి స్తాయన్నారు. నారింజ, నిమ్మ, బత్తాయి లాంటి పండ్లు వాడాలని, ఆకు కూరలు, పాలు, గుడ్లు, బెల్లంక, అటుకులు, వేరుశెనగ గుండ్లు తీసుకుంటే రక్తహీ నతను తగ్గిస్తామని వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ జోత్స్న, ఏఎన్ఎం సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● చాట్రాయి : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిత్తపూరు తూర్పు దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకోవటం, చిరుధాన్యాల వలన ఉపయోగాలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవల్సిన ఆహారం మొదలైన అంశాలపై సూపర్‌వైజర్ గాయత్రీదేవి అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతం జరిపారు. అంగన్వాడీ కేంద్రం ఆవరణలో తల్లి బిడ్డల పేరు మీద మొక్కలు నాటారు. ఏఎన్ఎం సామ్రాజ్యం, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● నూజివీడు : ఆరోగ్యకర సమాజ నిర్మాణం కోసం పోషకాహారాన్ని తీసుకోవడం ఒక్కటే మార్గమని నూజివీడు సీడీపీవో ఎస్.నూరాని అన్నారు. నూజివీడు పట్టణం బాపునగర్‌లో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పోష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన నిర్వహిం చారు. తృణ ధాన్యాలు అధికంగా తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని చెప్పారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, హెచ్‌వీ కుమారి, తదితరులు పాల్గొన్నారు.